# సకల ఆశీర్వాదములకు నిలయము

పాపులకు, పరిశుద్ధులకు ఏకంగా, వర్షము, సూర్యకాంతి, సమృద్ధియైన భౌతిక ఆశీర్వాదములు సృష్టి మూలముగా దేవుడు ప్రసాదించాడు (మత్తయి 5:45). "... ఆయన ఆకాశమునుండి మీకు వర్షమును, ఫలవంతములైన రుతువులను దయచేయుచు, ఆహారమునను గ్రహించుచు, ఉల్లాసముతో మీ హృదయములను నింపుచు"నే ఉన్నాడు (అపొ. 14:17). ఏదియెలాగున్నా, అవి నిజమైన ఆత్మసంబంధమైన దీవెనలు కానేరవు. ఆత్మసంబంధమైన ప్రతి ఆశీర్వాదము తన అద్వితీయ కుమారునియందు అనుగ్రహించడం తండ్రికి అభీష్టమయ్యింది (యోహాను 10:9; 14:6; 15:5; అపొ. 4:12; కొలస్సీ. 1:27). క్రీస్తునకు వెలుపల ఆత్మసంబంధమైన ఏ ఆశీర్వాదమును లేదు; ఆయనయందే సమస్తము గుప్తం చేయబడ్డాయి (ఎఫెసీ. 1:3).

క్రీస్తునకు వెలుపలనున్న వ్యక్తులను వారి పాపములు, అక్రమములు తమకు విరోధంగానే లెక్కించబడతాయి; కాని క్రీస్తులోనికి ఒకవ్యక్తి వచ్చిన క్షణం మొదలుకొని, ప్రతి పాపమును క్షమింపబడుతుందని, దానిని ఎన్నటికిని జ్ఞాపకము చేసికొననని, అబద్ధమాడజాలని వానివలన వాగ్దానం చేయబడింది (హెబ్రీ. 8:12). పరలోకపు అతిథియైన పరిశుద్ధాత్మ యొక్క అంతరంగ నివాసము క్రీస్తునకు వెలుపటవారు అనుభవించలేరు, ప్రభువైన యేసుకు లోబడిన ప్రతివానిలో నివసించడానికి ఆయన వస్తాడు (యోహాను 14:17; అపొ. 2:38; 5:32; గలతీ. 4:6).

అవిశ్వాసులైన వారు తమ సొంత వెలుగులో నిలిచియుంటారు, మరియు వారి క్షేమానికి వ్యతిరేకంగా పని చేస్తారు. క్రీస్తులోనికి ప్రవేశించినవారు, విశ్వం యొక్క చట్టాల క్రింద తమ్మును తామే పెట్టుకుంటారు. మేలు కలుగుటకై సమస్తము సమకూడి జరుగుతుందనే వాగ్దానం వారికి ఉంది (రోమా 8:28).

దేవునియందు విశ్వాసముంచినవారు సహితం, క్రీస్తునకు వెలుపల నిలిచియుంటే, "మా తండ్రీ" అని ప్రార్థించే హక్కు లేనివారై యుంటారు. వారు ఖచ్చితంగా చెప్పాలంటే, "మా సృష్టికర్తా" అని పిలువవలసిందే. దానికి భిన్నంగా, క్రీస్తులో ఉన్నవారందరు తండ్రియొక్క కుటుంబంలోనికి దత్తు తీసికొనబడినవారై ఉంటారు. "అబ్బా! తండ్రీ!" అని వారు పిలుచుటయందు ఆయన ఆనందించువాడైయుంటాడు (గలతీ. 4:5-7). అలాగే, క్రీస్తుకు వెలుపల ఉన్న జనులకు తమ పక్షంగా మాట్లాడగల పెద్దన్న ఎవరూ లేరు. దేవుని కుడిపార్శ్వమున, దేవుని కుటుంబ సభ్యులకు, యేసుక్రీస్తు అను జ్యేష్ఠుడు తమ పక్షంగా వాదించే ఉత్తరవాదిగాను, విజ్ఞాపనము చేయువాడుగాను నిలిచియున్నాడు

(హెబ్రీ. 7:25; 1 యోహాను 2:1, 2).

క్రైస్తవేతరులతో పొత్తు క్రైస్తవ జీవితాలను, బాంధవ్యాలను ఫలభరితంగా చేసే ఆత్మసంబంధమైన ఆధారము సహజంగా లోపిస్తుంది. ఒక వ్యక్తి క్రీస్తులోనికి వచ్చినప్పుడు, లోకంలో ఉండే మేలైన జనంతో సహవాసానికి వచ్చినవాడైయుంటాడు. వారి నైతిక స్థాయి చాలా హెచ్చయినది (తండ్రి చిత్తాన్ని జరిగించాలనేవారి ఉద్దేశం; యోహాను 6:38), భూమిమీద సాటిలేనిదైయుంటుంది. తేజోవాసులైన పరిశుద్ధుల స్వాస్థ్యములో పాలివారగుటకు పాత్రులుగాను క్రీస్తునందున్నవారు ఉంటారు. వెలుపట చీకటిలో త్రోయబడే వారితో అట్టివాడు తన దినాలను ఏ మాత్రమును గడపడు (కొలస్సీ. 1:12; మత్తయి 25:30).

జనులు క్రీస్తులోనికి ఎలా వస్తారో కేవలం లేఖనంలోని రెండు వచనాలు తెలుపుతాయి:

> క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా? (రోమా 6:3).

> క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు ... (గలతీ. 3:27).

బాప్తిస్మం పొందడం ద్వారా ఒకడు క్రీస్తులోనికి ప్రవేశిస్తాడని ఈ రెండు లేఖన భాగాలు తెలుపుతున్నాయి. నిష్కపటమైన విశ్వాసము, నిజమైన మారుమనస్సును వెంబడించిన బాప్తిస్మము క్రీస్తులోనికి ప్రవేశించడానికి ఒకడు లోబడవలసిన చివరి ఆజ్ఞయైయుంది. అనేక ఆజ్ఞలు అటు పిమ్మట వస్తాయి, కాని క్రీస్తులోపల, క్రీస్తు వెలుపల అనే దానికి విభజించే గీత బాప్తిస్మమైయుంది.